క్లుప్తంగా

జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీని కలిసిన సర్పంచ్

దేవరపల్లి: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గంటా పద్మశ్రీని దేవరపల్లి మండలం యర్నగూడెం సర్పంచ్ బొంతా భరత్‌బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం ఏలూరులోని ఆమె క్యాంపు కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు.

గో వధ చేస్తే కఠిన చర్యలు

పెరవలి: బక్రీద్ సందర్భంగా గురువారం మండలంలో ఎక్కడైనా గో వధ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. పండగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం పెరవలి మండలంలో ఎక్కడైనా ఏ జంతువునైనా వధిస్తే చట్టరీత్యా నేరమని, శిక్షలు తప్పవని ఆమె హెచ్చరించారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ, పంచాయతీ, పశుసంవర్ధక శాఖాధికారులు పర్యవేక్షించాలని తెలిపారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

కొవ్వూరు: అన్నదేవరపేటలో పోలీసులు రూట్ వాచ్ నిర్వహిస్తుండగా గోపాలపురం మండలం గోపవరం గ్రామానికి చెందిన నక్కా సత్యనారాయణ మోటారుసైకిల్‌పై సారా తరలిస్తూ పట్టుబడ్డాడు. అతనిని అరెస్టు చేసి, 25 లీటర్ల సారా, మోటారుసైకిల్‌ని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీ సత్యనారాయణ తెలిపారు. నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు.

పోలీస్ స్టేషన్‌కు హెచ్చరిక బోర్డుల అందజేత

తాళ్లపూడి: మండల మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌కు బుధవారం హెచ్చరిక బోర్డులను అందజేశారు. మానవత అధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఎస్సై కె.వెంకట రమణకు ప్రమాదకరంగా ఉన్న మలుపుల్లో ఏర్పాటు చేయడానికి బోర్డులను అందజేశారు. వాటిని ఏటి గట్టు రోడ్డులో చిడిపి వద్ద, గజ్జరం మలుపులో ఏర్పాటు చేస్తామని ఎస్సై వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ వి.చంద్రయ్య, సాయన సుబ్బారావు, అప్పన చంద్రగుప్త, సిబ్బంది ఫణి, నాగేంద్ర, శివరాం, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన కొండేపూడి రాజు ఈనెల 27న గుండెపోటుతో మృతిచెందడంతో బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్, ఎంపీటీసీ పడాల రంగారావు, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, పంచాయతీ కార్యదర్శి కేవీ సుబ్బన్న, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు

ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి



పట్టణంలో ట్రాఫిక్ మళ్లింపుపై చర్చిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాణ

నిడదవోలు: పట్టణంలో ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలో గణేష్‌చౌక్ సెంటర్ నుంచి గణపతి సెంటర్ వరకూ రోడ్ల విస్తరణలో భాగంగా రూ.3 కోట్లతో జరుగుతున్న సీసీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్, డివైడర్లు వంటి అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ సీసీ రోడ్డు పనులు ఒకవైపు పూర్తయ్యాయని, మరోక వైపు పనులు జరుగుతుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందన్నారు, దీనికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆక్రమణలను తొలగించాలని అధికారులకు ఆదేశించామన్నారు. అయితే ఇప్పటికే పూర్తయిన సీసీ రోడ్డుపై వాహనాల రాకపోకలపై బుధవారం పోలీస్, ఆర్టీసీ, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి రోడ్డు విస్తరణ పనుల వద్దకు వెళ్లి పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, ఎస్కే వజీరుద్దీన్, పువ్వల రతీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగుల గోపియాదవ్, ఎండీ ఫయాజ్, తోలేటి సత్యనారాయణ, టౌన్ ప్లానింగ్ అధికారి సుప్రియా, మున్సిపల్ ఏఈ హేమంత్, సిబ్బంది పాల్గొన్నారు.

సంస్థాగతంగా పార్టీని పటిష్టం చేసేందుకు చర్యలు

కొవ్వూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల సమయానికి పార్టీ సంస్థాగతంగా పటిష్టం చేసేందుకు పట్టణ, మండల పరిధిలో వివిధ కమిటీల నియమకంతోపాటు బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సోడదాసి మార్టిన్ లూథర్ ప్రకటించారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. పార్టీని అధికారంలోకి తీసుకోచ్చేందుకు నాయకులంతా కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అరిగెల అరుణ కుమారి, పట్టణ పార్టీ అధ్యక్షుడు గంధం బాజ్జీ, బ్లాక్-1 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొణిదెల శ్రీనివాస్, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అందే నాగభూషణం, జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, అనపర్తి నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి వడియార్, మురళీధర్ పాల్గొన్నారు.

అమ్మఒడితో ఆనందం

- తల్లుల బ్యాంకు ఖాతాలకు నిధుల జమ
- గోపాలపురం నియోజకవర్గానికి నాలుగో విడతకు రూ.42.27 కోట్ల విడుదల



దేవరపల్లిలో జగనన్న అమ్మఒడి కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, వారి తల్లులు

దేవరపల్లి: ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చింది. ప్రతి నిరుపేద విద్యార్థి ఉన్నత విద్యను అందించాలనే ఉద్దేశంతో పలు పథకాలు అమలు చేస్తోంది. దీనిలో భాగంగా జగనన్న అమ్మఒడి పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకంలో విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాకు రూ.13వేల జమచేస్తోంది. ఇప్పటి వరకు మూడు విడత వేసింది. నాలుగో విడత జగనన్న అమ్మఒడి కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం బటన్ నొక్కి ప్రారంభించారు. విద్యార్థుల తల్లుల ఖాతాలకు అమ్మఒడిని జమ చేయడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్క విద్యార్థి తల్లి ఖాతాకు రూ.13 వేలు చొప్పున జమ చేశారు.

ఆర్థికంగా కొండంత బలాన్ని ఇస్తూ..

గతంలో పేద కుటుంబాల పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించాలంటే ఆర్థికంగా ఇబ్బందులు పడేవారు. అమ్మఒడి ఆ పేద విద్యార్థుల కుటుంబాలకు కొండంత బలాన్ని ఇచ్చింది. ఆర్థికంగా ఎంతో ఊరటను కలిగించింది. వైఎస్సార్ ప్రభుత్వం వచ్చిక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో మార్పులు తెచ్చి అమ్మఒడి పథకానికి రూపకల్పన చేశారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లుల ఖాతాలకు ఏడాదికి రూ.13 వేల చొప్పున జమ చేస్తున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా అమ్మఒడి పథకం ద్వారా వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నాలుగు విడతలుగా 1,09,340 మంది తల్లులకు రూ.165 కోట్లు ప్రభుత్వం జమ చేసింది. నాలుగో విడతగా 2023 సంవత్సరానికి 27,497 మంది తల్లుల ఖాతాలకు రూ.42.27 కోట్లు ప్రభుత్వం జమ చేసింది. దేవరపల్లి మండలంలో 7340 మంది తల్లుల ఖాతాలకు రూ.11.01 కోట్లు, ద్వారకాతిరుమల మండలంలో 6921 మంది తల్లుల ఖాతాలకు రూ.10.38 కోట్లు, గోపాలపురం మండలంలో 5826 మంది తల్లుల ఖాతాలకు రూ.8.73 కోట్లు, నల్లజర్ల మండలంలో 7410 మంది తల్లుల ఖాతాలకు రూ.11.15 కోట్లు జమ చేసింది.

నాలుగు విడతలుగా ప్రభుత్వం జమ చేసిన జగనన్న అమ్మఒడి నిధులు, తల్లుల వివరాలు

విద్యా సంవత్సరం	తల్లుల సంఖ్య	జమ చేసిన సొమ్ము (రూ. కోట్లలో)
2020	27075	40.61
2021	26380	39.57
2022	28388	42.56
2023	27497	42.27
నాలుగు సంవత్సరాలు	1,09,340	165.01

పేద విద్యార్థులకు వరం



జగనన్న అమ్మఒడి పథకం పేద విద్యాలకు వరం వంటిది. అమ్మఒడి ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద కుటుంబాల పిల్లల ఉన్నత విద్యకు ప్రోత్సహిస్తున్నారు. విద్యకు పెద్దపీట వేసి వేల కోట్ల రూపాయాలు వెచ్చిస్తున్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చారు. గోపాలపురం నియోజకవర్గంలో నాలుగు విడతలుగా జగనన్న అమ్మఒడి పథకంలో 1,09,340 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.165.01 కోట్లు ప్రభుత్వం జమ చేసింది. పది రోజులు అమ్మఒడి డబ్బులు తల్లుల ఖాతాలకు జమ అవుతాయి. ఒకొక్క విద్యార్థికి రూ.15 వేలు ప్రభుత్వం ఇస్తుంది. దీనిలో రూ.2 వేలు పాఠశాల నిర్వహణ నిధికి జమ చేస్తారు. నాలుగో విడత రూ.42.27 కోట్లు జమ అయింది.

– తలారి వెంకట్రావు, ఎమ్మెల్యే, గోపాలపురం

నేడు 'జగనన్న సురక్ష'పై హోమ్ మంత్రి సమీక్ష

కొవ్వూరు: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో హోమ్ మంత్రి తానేటి వనిత గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ తెలిపారు. జూలై ఒకటో తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం కానున్నందున మండలంలోని అన్నీ గ్రామాల సచివాలయ కన్వీనర్లు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వైఎస్సార్ సీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి

నిడదవోలు రూరల్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు విజయవంతం చేయాలని ఎంపీడీఓ పి.శామ్యూలు కోరారు. సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలు చేరేలా చూడాలన్నారు. కుల, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, రేషన్ కార్డుల సవరణ, పింఛన్లు, రైతులకు సంబంధించిన పలు సమస్యలు పరిష్కరించి ప్రజలకు చేరువ కావాలని అన్నారు. ఈఓపీఆర్డీ రత్నమాలిక, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందేలా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు అన్నారు. పాలంగిలో జగనన్న సురక్ష కార్యక్రమంపై వలంటీర్లకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సచివాయం కార్యదర్శి హసన్ జానీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలు : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ఆదేశించారు. జగనన్న సురక్ష పథకంలో భాగంగా పట్టణంలో 26వార్డులో బుధవారం ఆయన వలంటీర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటా పర్యటించారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, కౌన్సిలర్లు గోపిరెడ్డి శ్రీనివాస్, కామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్లను పరిశీలించిన జేసీ



కృష్ణంపాలెంలో జగనన్న లేఅవుట్లను పరిశీలిస్తున్న జేసీ తేజ్‌భరత్

దేవరపల్లి: మండలంలోని కృష్ణంపాలెం, ధుమంతునిగూడెం, యర్నగూడెం గ్రామాల్లో పేదలకు ఇచ్చిన జగనన్న లేఅవుట్లను బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ పరిశీలించారు. రెండు గ్రామాల్లో ప్రభుత్వం సుమారు 10.37 ఎకరాలను కొనుగోలు చేసి 400 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాలు కేటాయించి పట్టాలు అందజేశారు. కృష్ణంపాలెం వద్ద ఇచ్చిన ఇళ్లస్థలాలు లోతట్టు ప్రాంతంలో ఉండడం వల్ల వర్షాకాలంలో స్థలాలు పూర్తిగా మునిగిపోతున్నాయని, నివాసాలకు యోగ్యంగా లేవని, వేరే చోట స్థలాలు లబ్ధిదారులు ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి విజ్ఞప్తి చేశారు. అలాగే యర్నగూడెంలోని లబ్ధిదారులకు నల్లజర్ల మండలం అనంతపల్లి సమీపంలో ఎర్రకాలువ వద్ద 7 ఎకరాల భూమిని సేకరించి 250 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. గ్రామానికి సుమారు ఐదు కిలో మీటర్ల దూరంలో స్థలాలు ఇవ్వడం వల్ల అక్కడకు వెళ్లడానికి ఇష్టపడడంలేదు. వేరొక చోట గ్రామానికి దగ్గరలో ఇవ్వాలని లబ్ధిదారులు అధికారులను కోరారు. ఈ నెల 26న జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో లబ్ధిదారులు కలెక్టర్ కె.మాధవీలతకు అర్జీ అందజేశారు. దీంతో ఆమె జేసీ తేజ్‌భరత్, కొవ్వూరు ఆర్డీఓ ఎస్.మల్లిబాబు లేఅవుట్లను బుధవారం పరిశీలించారు. కృష్ణంపాలెం లేఅవుట్‌ను మెరక చేసి రోడ్డు సదుపాయం కల్పించాలని, లేదంటే భూమి ఇవ్వడానికి రైతులు ముందుకు వస్తే ఈ భూమిని రైతులకు ఇచ్చి, రైతుల వద్ద గ్రామానికి చేరువగా ఉన్న భూములను తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. యర్నగూడెంలో కూడా ఇదే విధంగా భూములను సేకరించాలన్నారు. త్వరితగతిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కృష్ణంపాలెంలో లేఅవుట్ సమస్యను ఎంపీటీసీ సభ్యుడు సత్తి జగదీశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్తి సాయిఈశ్వరరెడ్డి జేసీకి వివరించారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ డీఈఈ టి.శేఖర్‌బాబు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, యర్నగూడెం సర్పంచ్ బొంతా భరత్ బాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సంఘటితంగా పోరాడి హక్కులు సాధించుకుందాం

దేవరపల్లి: కార్మికులంతా సంఘటితంగా పోరాడి హక్కులు సాధించుకోవాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య రెండో జిల్లా మహాసభ పిలుపునిచ్చింది. దేవరపల్లి మండలం దుద్దుకూరులో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ కార్మిక సమాఖ్య జిల్లా రెండో మహాసభ జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రగతిశీల కార్మికసమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కే.మస్తాన్ అధ్యక్షతన జరిగిన ఈసభలో వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.చిట్టిబాబు, కులనిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డుప్రభాకర్, విప్లవ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణ, కులనిర్మూలన సంఘజిల్లా అధ్యక్షుడు ఎం.జాన్‌రాజు, మహాజన సోషలిష్టు పార్టీ జిల్లా కన్వీనర్ చెట్టే రామకృష్ణ తదితరులు ప్రసంగించారు. ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

చెత్త తరలింపును అడ్డుకున్న ఐ.పంగిడి వాసులు



ఐ.పంగిడిలో చెత్త ట్రాక్టర్లకు అడ్డుగా రోడ్డుపై బైఠాయించిన స్థానికులు

సమస్యను పరిష్కరించిన అధికారులు

కొవ్వూరు: ఐ.పంగిడి సమీపంలో జిల్లా పరిషత్‌కి చెందిన ఖాళీ స్థలంలో డపింగ్ చేసేందుకు వెళ్లిన కొవ్వూరు పురపాలక సంఘం చెత్త ట్రాక్టర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. కొవ్వూరులో చెత్త మా ఊరులో వద్దు అంటూ రోడ్డుకు అడ్డుగా బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో ఆర్డీవో ఎస్.మల్లిబాబు, డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, ఇతర అధికారులు అక్కడకు చేరుకొని ఆందోళనకారులతో చర్చించారు. గ్రామానికి దూరంగా ఉన్నందున చెత్త తరలింపునకు అభ్యంతరం ఏమిటని అధికారులు ప్రశ్నించారు. తమ గ్రామంలో 900 నుంచి వెయ్యి అడుగులు పైబడి తాగునీటి బోర్లు వేస్తున్నామని, ఇక్కడ చెత్త వేయడం వల్ల భూగర్భ జలాలు కలుషితమవుతాయని వాదించారు. స్థానికులు గట్టిగా ప్రతిఘటించడంతో ప్రత్యామ్నాయంగా దేచెర్ల రెవెన్యూ పరిధిలో గ్రామాలకు దూరంగా ఉన్న ఆర్లమ్మ క్వారీ ప్రాంతాన్ని, దేచెర్ల సమీపంలో మరో ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు. చివరికి వాదోపవాదనల తర్వత ఆర్లమ్మ క్వారీ స్థలంలో చెత్తను డంపింగ్ చేశారు. అయితే ఈ క్వారీ గౌరీపట్నం గ్రామం దాటిన తర్వత ఉండడంతో పురపాలక సంఘానికి రవాణా భారంగా మారుతుందని కమిషనర్ శ్రీకాంత్ చెబుతున్నారు. రూరల్ సీఐ వైవీ రమణ, ఎస్సైలు జి.సతీష్, సీహెచ్ రమేష్, ఆర్‌ఐ సర్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ వీరమళ్ల రాయుడు, ఉప సర్పంచ్ ఉప్పులూరి వెంకట ఫణి కృష్ణారావు(నానాజీ), చౌటుపల్లి శివ, చౌటుపల్లి శ్రీనివాస్, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్తిబాబు, పెరుగు శివ, బొల్లా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్ద పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యే



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: విద్యార్థులకు పోషకాలతో కూడిన బలమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్దను బుధవారం దేవరపల్లిలోని అంబటి సత్యరారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరిశీలించారు. భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను వారు అడిగి తెలుసుకున్నారు. చిక్కిలు, రాగిజావ ఇస్తున్నారా అని విద్యార్థులను అడిగారు. భోజనం బాగుంటుందని, రాగిజావ, చిక్కీలు ఇస్తున్నారని విద్యార్థులు సమాధానమిచ్చారు. జగనన్న గోరుముద్ద అమలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనాన్ని వారు వడ్డించారు.

న్యాయమూర్తి సేవలు అభినందనీయం



సభలో మాట్లాడుతున్న జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి అన్నపూర్ణ

కొవ్వూరు: జిల్లా తొమ్మిదో అదనపు జడ్జిగా పి.అన్నపూర్ణ అందించిన సేవలు అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. పదోన్నతిపై కడప ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జిగా బదిలీ అయిన సందర్భంగా న్యాయమూర్తి అన్నపూర్ణకు బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను పూలమాలలు వేసి, శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు బొబ్బా భారతీ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ అన్నపూర్ణ ఫాస్ట్ ట్రాక్ జడ్జిగాను, మేజిస్ట్రేట్,జిల్లా అదనపు జడ్జిగా సుమారు పదేళ్లు పాటు కొవ్వూరు సేవలందించారని కొనియాడారు. భవిష్యత్‌లో ఆమె మరింత ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆశాభావం వ్యక్తం చేశారు. తాను సమర్థవంతంగా పనిచేయడానికి సహకరించిన వారందరికీ న్యాయమూర్తి అన్నపూర్ణ ధాన్యవాదాలు తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి సత్యవతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.ధర్మరావు, సెకండ్ అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జి.సాయికృష్ణ, సీనియర్ న్యాయవాదులు నీరుకొండ సూర్యనారాయణ, వీవీ సుబ్బారావు, కె.రాఘవులు, నిమ్మగడ్డ పుల్లారావు, యు.కృష్ణారావు, కార్యదర్శి తక్కెళ్ల చిట్టిబాబు, న్యాయవాద గుమస్తాలు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లకు ఈ-స్టాంపులు

ఈనెల 27వ తేదీ నుంచి మొదలైన ప్రక్రియ



అనంతపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఏర్పాటు ఈ-స్టాంపుల ఫ్లెక్సీ

నల్లజర్ల: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. నాన్‌జ్యుడీషియల్ స్టాంపుల స్థానంలో ఈ-స్టాంపులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ మేరకు ఈనెల 27వ తేదీ నుంచి అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ-స్టాంపుల జారీ ప్రక్రియ మొదలైంది. అనంతపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఇద్దరు స్టాంప్‌వెండర్స్ ఈ-స్టాంపింగ్ ఏజెన్సీ తీసుకున్నట్టు సబ్‌రిజిస్ట్రార్ వాసిరెడ్డి రాఘవేంద్రప్రసాద్ చెప్పారు. ఈ-స్టాంపులతో పాటు ఇప్పటివరకూ చెలామణిలో ఉన్న స్టాంపులను కూడా కొంతకాలం వరకు అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. క్రమేణా సాధారణ స్టాంపులను తగ్గించి ఈ-స్టాంపులు అందుబాటులో ఉంటాయన్నారు. నకిలీ స్టాంపులు అరికట్టడం, అధిక ధరలకు స్టాంపుల విక్రయాలు, పాతతేదీలతో ఉన్న స్టాంపులను చలామణి చేయడం తదితర అక్రమాలకు ఈ-స్టాంపుల ద్వారా అడ్డుకట్టవేయవచ్చునని ప్రభుత్వం భావిస్తోంది. విలువైన ఆస్తులకు మరింత చట్టబద్ధత కల్పించడానికి ఈ-స్టాంపుల ప్రక్రియ దోహదపడుతుందంటున్నారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మరింత సరళితరం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.

జగనన్న ఇళ్ల స్థలాల్లో జియో ట్యాగింగ్



అనంతపల్లిలో జియోట్యాగింగ్ చేస్తున్న గృహనిర్మాణ శాఖ ఏఈ శివ, సిబ్బంది

నల్లజర్ల: జగనన్న నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా చదును చేసిన లేఅవుట్లలో లబ్ధిదారులకు ప్లాట్లను జియోట్యాగింగ్ చేసే ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. మండలంలో 38 లేఅవుట్లలో 29 లేఅవుట్లలో ఈ ప్రక్రియ పూర్తయినట్టు గృహనిర్మాణ శాఖ ఏఈ శివ తెలిపారు. అనంతపల్లిలో ఎర్రకాలువ బ్రిడ్జి సమీపంలోని లేఅవుట్‌లో బుధవారం లబ్ధిదారులకు ప్లాట్ల జియోట్యాగింగ్ చేశారు. ఇక్కడ 274 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వగా నిర్మాణాలు చేస్తున్నారు. అన్ని లేఅవుట్లలో జూలై 8న దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి రోజు శంకుస్థాపన కార్యక్రమాలు జరుగుతాయని చెబుతున్నారు. లేఅవుట్లలో నిర్మాణాలకు సంబంధించి కావాల్సిన నీటిసదుపాయం, తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు, ఇతర మౌలిక సదుపాయాలను ఆయా శాఖల అధికారులు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. మండలంలో 2016 ఇళ్ల నిర్మాణం జరగాల్సి ఉండగా ఇప్పటికే పోతవరం, చీపురుగూడెం, తెలికిచెర్ల, దూబచర్ల, పుల్లలపాడులలో 130 వరకు ప్రారంభమయ్యాయి. మొదటి దశ బిల్లులు కూడా తీసుకున్నారు. ఆయనతో పాటు గ్రామ కార్యదర్శి విజయకుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సలీం, వీర్వోలు శ్రీనివాస్, రామారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రక్కిలంకలో సీఎస్‌బీ బ్యాంకు నూతన బ్రాంచి ప్రారంభం



ప్రక్కిలంకలో సీఎస్‌బీ నూతన బ్రాంచిని ప్రారంభిస్తున్న సింహాద్రి జనార్దనరావు

తాళ్లపూడి: ప్రక్కిలంకలోని డాక్టర్ జేవీ కృష్ణారావు కాంప్లెక్స్‌లో బుధవారం సీఎస్‌బీ బ్యాంక్ నూతన బ్రాంచిని మండల రైస్ మిల్లర్స్, గోవూరు రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు ప్రారంభించారు. 103ఏళ్ల నుంచి బ్యాంకింగ్ సేవలు అందజేస్తుందన్నారు. 20వ బ్రాంచిని మండలంలో ప్రారంభించినట్టు మేనేజర్ ప్రసాద్ తెలిపారు. సర్పంచ్ యాళ్ల స్వప్న, డాక్టర్ భాను ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు యాళ్ల బాబురావు, బ్యాంక్ సిబ్బంది దివ్య, షైని, వైష్ణవి, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు జలజీవన్ మిషన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

నిడదవోలు రూరల్: మండలంలోని సింగవరం, మునిపల్లి గ్రామాల్లో గురువారం జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్లు, కుళాయిల ఏర్పాటు పనులకు ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు శంకుస్థాపన చేస్తారని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.శ్రీనివాస్ బుధవారం తెలిపారు.